ఫ్లాష్ ఫ్లాష్ ఫ్లాష్

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

15 మందికి గాయాలు..





నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు చంద్రగిరి విల్లాస్ కాలనీకి వెళ్లే దారి వద్ద శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుమారు 15 నుంచి 20 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను స్థానిక జనరల్ ఆసుపత్రికి తరలించారు. 9 నెలల గర్భిణి హేమశ్రీకి నొప్పులు రావడంతో వైద్యులు చికిత్స ప్రారంభించారు. ఓ ట్రావెల్ బస్సు హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్తోంది. మర్రిగూడ బైపాస్ వద్ద వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డుపై అడ్డంగా పెట్టిన బారికేడ్లు తప్పించబోయి బస్సు పల్టీ కొట్టింది. ఈ సమయంలో 35 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు బస్సు పల్టీకొట్టడంతో కేకలు పెట్టారు. ట్రాఫిక్ జామ్ అవగా.. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పొదుపు తెచ్చిన పండగ



మగ్గంపై వస్త్రం నేస్తున్న చేనేత కార్మికుడు

చౌటుప్పల్, న్యూస్‌టుడే:

చేనేత కార్మికులు పండగ పూట పస్తులుండకుండా నేతన్నకు చేయూత పథకంలో పొదుపు చేసుకున్న డబ్బును బ్యాంకుల నుంచి విడుదల చేయనున్నారు. ఈ పథకం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ వాటా బకాయిలను ఉమ్మడి నల్గొండ జిల్లాకు చేనేత, జౌళిశాఖ ద్వారా నెల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా సహాయ సంచాలకులు బ్యాంకులకు వెళ్లి పొదుపు ఖాతాల లెక్కలన్నీ సరి చూసి చేనేత కార్మికుల రికరింగ్ డిపాజిట్ ఖాతా-2ల్లో ప్రభుత్వ వాటా డబ్బును జమ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నిధుల విడుదలకు ఉత్తర్వులు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'నేతన్నకు చేయూత' పథకంలో 36 నెలల పాటు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న ఒక్కో చేనేత కుటుంబానికి రూ. 2,80,400, వడ్డీ కూడా అందనున్నాయి. చేతినిండా పని లేక, నేసిన వస్త్రాలు అమ్మకాలు జరుగక ఇబ్బందులు పడుతున్న చేనేత కుటుంబాలకు ఈ డబ్బుతో కొంత వెసులుబాటు లభించనుంది. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ పథకాన్ని కొనసాగిస్తారా? అని చేనేత కార్మికులు ఎదురు చూస్తున్నారు. కొత్తగా రికరింగ్ డిపాజిట్ ఖాతాలు తెరిపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు రాలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

○ చేతికందనున్న డబ్బు

ఆర్థిక భరోసా కల్పించే

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలని, వారిలో పొదుపు అలవాటును ప్రోత్సహించాలని భారాస ప్రభుత్వం నేతన్నకు చేయూత పథకాన్ని మూడేళ్ల కాలపరిమితితో భూదాన్ పోచంపల్లిలో 2017 జూన్ 24న ప్రారంభించింది. 2000 మే నెలలో పూర్తయింది. కరోనా రావడంతో మూడు నెలల ముందుగానే డబ్బు చేతికిచ్చారు. ఏడాది పాటు ఈ పథకాన్ని పునరుద్ధరించలేదు. చేనేత కార్మికులు విన్నవించుకోవడంతో అప్పటి ప్రభుత్వం రెండో విడత 2021 జూలైలో ఈ పథకాన్ని ప్రారంభించారు. గడువు పూర్తి కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పది నెలల పాటు నిలిచిపోయిన ఖాతా-2 లలో ప్రభుత్వ వాటా డిపాజిట్లను ఒకే సారి జమ చేసింది. 2024 ఆగస్టు నెలతో ఈ పథకం మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. దీంతో రికరింగ్ ఖాతా-1, 2లు రద్దు చేసి వడ్డీతో సహా డబ్బును చేనేత కార్మికుల చేతికివ్వనున్నారు.

నేతన్నకు చేయూత పథకంలో లబ్ధిదారులు

జిల్లా	చేనేత కార్మికులు
యాదాద్రి	11,099
నల్గొండ	5,500
సూర్యాపేట	200

ఒక్కొక్కరికి వచ్చేది ఎంతంటే..

కార్మికులు	పొదుపు చేసుకున్నవి	ప్రభుత్వ వాటా	మొత్తం
మగ్గం నేసే కార్మికుడు	రూ.43,200	రూ.86,400	రూ.1,29,600
అనుబంధ కార్మికుడు-1	రూ. 28,800	రూ.57,600	రూ. 86,400
అనుబంధ కార్మికుడు-2	రూ. 21,200	రూ.43,200	రూ. 64,400

కొనసాగించాలని కోరాం

– జి. బాలయ్య, 'ఆప్కో' మాజీ డైరక్టర్, భువనగిరి



పొదుపు పథకాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రిని కోరాం. గత ప్రభుత్వం జియోట్యాగ్ నిబంధన విధించడం వల్ల చేనేత కార్మికులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోలేక పోయారు. పొదుపు డబ్బు మగ్గం నేసే కార్మికుడికి రూ. 1200, అనుబంధ కార్మికులకు రూ. 800, రూ. 600 అనే పరిమితి ఉండేది. దీనిని సవరించాలి. చేనేత కార్మికుల పొదుపునకు రెట్టింపు డబ్బును ప్రభుత్వం జమ చేస్తే చేనేత కుటుంబాల ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతుంది.

బల్లాలు తుడిచి.. బతుకు బాటను మార్చి..!



సైదులు గౌడ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

నిరుపేద గీతకార్మిక కుటుంబం వారిది. జీవనోపాధి కోసం ఆరో తరగతిలోనే చదువు మానేసి, మద్యం దుకాణానికి అనుసంధానంగా ఉండే అనుమతి గదిలో బల్లాలు తుడిచే పనిలో చేరాడు ఆ కుర్రాడు. జీవితం, చదువు గొప్పతనాన్ని తెలుసుకుని దూర విద్యలో చదువు పూర్తి చేసి, నేడు అదే ఆబ్కారీ శాఖలో ఉద్యోగం సాధించాడు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్ తన జీవిత విశేషాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

పదోతరగతి 5, డిగ్రీలో 8 సార్లు అనుత్తీర్ణత

తల్లిదండ్రులు భిక్షం- ఎల్లమ్మ గీత కార్మికులుగా, రోజువారీ కూలీలుగా పని చేస్తుండేవారు. దీంతో కుటుంబ పోషణ కోసం ఆరో తరగతిలో చదువు మానేసి గ్రామంలోని మద్యం దుకాణంలో అనుమతి గదిలో రూ.300 నెలవారీ వేతనానికి పనిలో కుదిరాను. ఐదేళ్ల తర్వాత 2005లో దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పదో తరగతి 5 సార్లు, డిగ్రీలో 8 సార్లు ఫెయిల్ అయ్యాను. అదే సమయంలో మా కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీకి వచ్చిన తహసీల్దారు.. అర్హులైన వారికి పింఛన్లు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ సమయంలో నేనొక్కడినే రాయగలిగిన వాడిని కావడంతో వారి దరఖాస్తులన్నీ నింపి కార్యాలయంలో అందజేశాను.

★ నేను అందించిన దరఖాస్తుదారులకు కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యాయి. అప్పుడే నాకు గ్రూప్-2 ఉద్యోగం సాధించి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యానికి బీజం ఏర్పడింది. చదువు పూర్తి చేయాలనే ధ్యేయంతో సమీపంలోని మాళోతు తండాలో ఓ గది అద్దెకు తీసుకుని రెండు నెలల్లో డిగ్రీలో మిగిలిన 8 సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి, ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీసెట్ రాసి, ఎంఏ ఎకనామిక్స్‌లో 8వ ర్యాంకుతో సీటు సాధించాను. 68 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు లేకపోవడంతో మరోసారి పీజీ సెట్ రాస్తే 5 పీజీలలో 10లోపు ర్యాంకుల వచ్చాయి. లాసెట్‌లో 8వ ర్యాంకు వచ్చింది.

అమ్మకు క్యాన్సర్‌తో కుంగిపోయాను..

అమ్మ సర్వైకల్ క్యాన్సర్‌తో మృతి చెందడంతో కొంతకాలం కుంగిపోయాను. ఆ సమయంలో ఓ గదిని అద్దెకు తీసుకుని రేషన్ బియ్యంతో కాలం వెళ్లదీస్తూ, ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశాను. 2016లో గ్రూప్-2 పరీక్షలో 78 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. 2019 నుంచి నాగర్‌కర్నూలు, కోదాడలో పని చేసి ప్రస్తుతం హైదరాబాద్ ధూల్‌పేటలో విధులు నిర్వర్తిస్తున్నాను.

★ తిండి కోసం నేను పడిన కష్టాలు ఇతరులు పడకూడదనే లక్ష్యంతో 'మన ఆపద్బాంధవులు ఫౌండేషన్'లో భాగస్వామినై రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. సుమారు నాలుగైదు వేల మందికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ, ఇతర సహాయ కార్యక్రమాలు నిర్వహించాం.

చదువు విలువ తెలుసుకోవాలి:

చదువు విలువ నాకు ఆలస్యంగానైనా తెలిసింది. దీంతో చదువుపైనే దృష్టి సారించి, విజయాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో కృషి చేశాను. చదువే రాదనుకున్న నేను మొదట పదో తరగతిలో 42 శాతం, డిగ్రీలో 48 శాతం, బీఈడీలో 49శాతం మార్కులు సాధించాను. పీజీలో 68 శాతం, ఉద్యోగ పరీక్షలో 78 శాతం మార్కులు సాధించాను. తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనడానికి నేనే పెద్ద ఉదాహరణ. సైకిల్ కొనుక్కునేందుకు నెలల తరబడి మద్యం దుకాణంలో పని చేసిన నేను, నేడు కారులో తిరుగుతుంటే ఎంతో గర్వంగా ఉంది. నా జీవిత చరిత్రను వివరిస్తూ యూట్యూబ్‌లో చేసిన వ్యక్తిత్వ వికాస తరగతులు మంచి ఆదరణ పొందాయి.

అంబా భవాని దసరా ఉత్సవాలు షురూ



పెద్దమునిగల్ గ్రామంలో దసరా ఉత్సవాలకు సిద్ధమైన అంబా భవాని ఆలయం

చందంపేట, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే దసరా ఉత్సవాలకు వేళ అయింది. దసరా ముందు రోజు నిర్వహించే ఉత్సవాలకు అంబా భవాని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కులాలకు అతీతంగా నిర్వహించే ఉత్సవాలకు ఈ పర్యాయం భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు పూజారి భగత్ జీవన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ పూజారి తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షకు పూనుకున్నారు. ఈనెల 11 తెల్లవారుజామున ఉత్సవాలు ప్రారంభ నేపథ్యంలో ఉపవాస దీక్షవిరమణ అనంతరం వేల సంఖ్యలో జంతువుల బలిదానం చేయడం ఇక్కడి ఆనవాయితీ. పూజారి ఉపవాస దీక్ష సమయంలో పలు గ్రామాల భక్తులు పవిత్రంగా నిష్ఠతో ఉండటంతో పాటు మంచాలపై కూర్చోవడం, నిద్రించడం వంటివి చేయకూడదు. క్షవరం నిషేధంతో పాటు మరిన్ని నిబంధనలను ఇక్కడి గిరిజనులు పాటిస్తుంటారు. మూడు రోజులపాటు కొనసాగే ఉత్సవాలకు పోలీసుల భారీ బందోబస్తు నిర్వహిస్తారు.



ఉపవాస దీక్షలో పూజారి కేతావత్ జీవన్‌భగత్

క్రీడా స్ఫూర్తి చాటాలి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి చాటాలని కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం 69వ తెలంగాణ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ టోర్నీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బాలికల విభాగంలో పూల్-ఏలో ఖమ్మం జట్టు విజయం సాధించింది. పూల్-బీలో వరంగల్ విజేతగా, నల్గొండ రన్నర్‌గా నిలిచాయి.

సీపీఎస్ పెన్షన్ విధానం రద్దుచేయాలి



నల్గొండలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో ఐకాస రాష్ట్ర ఛైర్మన్ జగదీశ్వర్

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని టీఎన్‌జీవో జాతీయ అధ్యక్షుడు, ఐకాస రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. నల్గొండలోని టీఎన్‌జీవో భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్‌సీ అమలు, ఐదు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను ట్రెజరీ ద్వారా ఇప్పించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్యాబినెట్ కమిటీ 317 జీవోను ప్రభుత్వ ఉద్యోగులందరికీ సానుకూలంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, నాయకులు సత్యనారాయణ గౌడ్, నర్సింహాచారి, వంగూరి విజయ్ కృష్ణ, జె. శేఖర్‌రెడ్డి, జయరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నియోజకవర్గంలో అయిదు వేల ఇళ్లు: మంత్రి

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్లు కట్టుకున్న అందరికీ యాజమాన్య హక్కు పత్రాలు అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన తిరుమలగిరి సాగర్ మండలంలో శనివారం రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. జానారెడ్డి అంటే నీతి నిజాయతీతో పని చేసిన వ్యక్తి అని, ప్రభుత్వానికి అనేక సూచనలు, సలహాలు అందజేస్తున్నారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే, జానారెడ్డి కోరిక మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాత్రం అయిదు వేల ఇళ్లు ఇస్తామని, ఈ నెలాఖరు లోగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. తిరుమలగిరి సాగర్ మండలంలో 4300 ఎకరాలు సర్వే చేస్తే అందులో 1300 ఎకరాలు నకిలీ పేర్లు నమోదు చేశారని, పేదవాడికి పట్టా రాలేదని వెల్లడించారు. రైతుబంధు కోసం దొంగ పాసు పుస్తకాలను అప్పటి నాయకులు అందజేశారని తెలిపారు.

భూ సమస్యలు పరిష్కారం:

– రమేష్, ఎర్రచెరువుతండా, రైతు

ఎన్నో ఏళ్ల నుంచి కృష్ణ పట్టి ప్రాంతాలలో భూమి పట్టా కోసం సుమారు రెండు నెలల నుంచి సర్వే చేస్తున్నారు. తిరుమలగిరి పైలెట్ ప్రాజెక్ట్‌తో రైతుల భూ సమస్యలు అన్ని పరిష్కారం కానున్నాయి.

చట్టాలపై అవగాహన అవసరం




నకిరేకల్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి

నకిరేకల్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, వయోవృద్ధుల రక్షణ చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి. దీప్తి కోరారు. నకిరేకల్ శివారులోని లయన్స్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సులో శనివారం మాట్లాడారు. వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వృద్ధులకు వారి బిడ్డల నుంచి రక్షణ, పోషణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి డివిజన్ స్థాయిల్లో ఏర్పాటైన ట్రైబ్యునళ్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. చిన్నారుల పెంపకంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఎం. నాగిరెడ్డి, లయన్స్ ట్రస్ట్ ఛైర్మన్ ఎన్. రాంమోహన్‌రావు, నకిరేకల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బి. ప్రకాశరావు, నవ్య క్లబ్ అధ్యక్షురాలు ఎన్. రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

☛ 1525 మందికి 1424 మంది హాజరు



ధ్రువీకరణపత్రాలు పరిశీలన చేయించుకుంటున్న అభ్యర్థులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 పోస్టులకు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన శనివారంతో ముగిసింది. మొత్తం 1525 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలువగా.. 1424 మంది ధ్రువపత్రాలు చూపించారు. 101 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. బుధవారం నుంచి నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టారు.

☛ ఎస్జీటీ విభాగంలో మొత్తం 1041 మంది అభ్యర్థుల్లో 974 మంది అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు సమర్పించారు. 67 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాలేదు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మొత్తం 364 మందికి 339 మంది సర్టిఫికెట్లు ధ్రువీకరించుకున్నారు. 25 మంది గైర్హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 49 మదికి 44 మంది, హిందీలో 20 మందికి 19, ఉర్దూలో ముగ్గురికి ముగ్గురు, ఆంగ్లంలో 57 మందికి 51, గణితంలో 36 మందికి 36, భౌతికశాస్త్రంలో ఆరుగురుకి ఆరుగురు, బయోసైన్స్‌లో 73 మందికి 69, సోషల్ స్టడీస్‌లో 111 మందికి 102, ఎస్ఏ(ఫిజికల్ డైరెక్టర్)లో 9మందికి 9 మంది ధ్రువ పత్రాలు పరిశీలించుకున్నారు.

☛ లాంగ్వేజి పండిట్ తెలుగులో 36 మందికి 32, హిందీలో 32 మందికి 30, ఉర్దూలో ముగ్గురికి ముగ్గురు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారు.. పీఈటీలో 18 మందికి 17, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 31 మందికి 29 మది తమ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు.

దక్కింది.. జలనిధి



నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వరుణుడి కరుణతో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. వానాకాలం పంటలకు పూర్తి స్థాయిలో భరోసా లభించింది. భూగర్భజలాలు పైపైకి వచ్చి యాసంగికి లాభదాయకంగా మారాయి. జిల్లాలో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. చెరువులు 80 శాతం వరకు నిండాయి. మరికొన్ని పూర్తిస్థాయిలో నిండి అలుగు పోయడంతో భూగర్భ జలం పైకి ఉబుకుతోంది. ప్రస్తుతం జిల్లా సగటు భూగర్భజలమట్టం 7.14 మీటర్ల పైన ఉంది. ఆగస్టు నెలతో పోలిస్తే 2.05 మీటర్లు పెరిగాయి. గుండ్లపల్లిలో తక్కువ లోతులో 2.26 మీటర్లు ఉండగా, చిట్యాలలో 11.50 మీటర్ల లోతులో నీళ్లున్నాయి.



నీరు ఎక్కువగా పోస్తున్న బోరు

మండలాల వారీగా భూగర్భ జలం ఇలా..

మండలం	ఆగస్టు (మీ)	సెప్టెంబరు (మీ)
చందంపేట	14.82	10.85
చింతపల్లి	9.63	7.11
దేవరకొండ	7.82	5.99
గుండ్లపల్లి	6.48	3.06
గుర్రంపోడు	4.84	2.26
కొండమల్లేపల్లి	6.53	2.63
మర్రిగూడ	9.50	8.93
నాంపల్లి	11.22	10.99
నేరేడుగొమ్మ	14.84	6.26
పీఏపల్లి	6.73	3.32
అడవిదేవులపల్లి	12.80	11.16
అనుముల	9.80	8.82
దామరచర్ల	9.19	8.31
మాడ్గులపల్లి	7.38	6.44
మిర్యాలగూడ	7.51	6.43
నిడమనూరు	9.38	8.73
పెద్దవూర	9.77	6.52
తిరుమలగిరి సాగర్	9.00	5.24
త్రిపురారం	9.48	8.39
వేములపల్లి	5.50	4.16
చండూరు	11.68	11.07
చిట్యాల	18.06	11.50
కనగల్	7.40	7.01
కట్టంగురు	14.27	10.23
కేతేపల్లి	14.50	10.04
మునుగోడు	9.09	7.63
నకిరేకల్	7.48	4.76
నల్గొండ	9.15	8.73
నార్కట్‌పల్లి	9.88	7.24
శాలిగౌరారం	11.58	8.11
తిప్పర్తి	7.16	4.34
గట్టుప్పల్	7.83	7.1

నీటిని వృథా చేయొద్దు..

– రేవతి, భూగర్భ జలశాఖ, డీడీ, నల్గొండ

నీటిని పొదుపుగా వాడుకోవాలి. రైతులు యాసంగిలో పంట మార్పిడి చేయాలి. పెరిగిన భూగర్భజలాలను వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలి. నీటిని ఒడిసి పట్టేందుకు రైతులు పొలాల్లో పారంపాండ్లు నిర్మించుకోవాలి. ఇళ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి.

కాంగ్రెస్‌తోనే మూసీ ప్రక్షాళన సాధ్యం: ఎంపీ చామల

నాగోలు, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోలులో శనివారం మూసీ పరివాహక ప్రాంత రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన ఎన్నో ఏళ్ల కల అని, కలుషిత నీటితో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ప్రభుత్వమూ నదీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందిస్తున్నా, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ఆ కలను సాకారం చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జిల్లాకు చెందిన భువనగిరి, తుంగతుర్తి, మిర్యాలగూడ, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, మహిళా సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపేందుకు..!



కొయ్యలగూడెంలోని ఆశ్రమం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: మానవ జన్మ గొప్పతనాన్ని వివరించి ప్రజల్ని సన్మార్గంలో నడిపేందుకు, సత్కర్మలు నిర్వహించేలా ప్రోత్సహించేందుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో శ్రీ శివరామ దీక్షిత అవధూత సంప్రదాయ రాజయోగ ఆశ్రమాన్ని 2003లో స్థాపించారు. 21 ఏళ్లుగా ఆశ్రమ అధిపతులు 'సుజ్ఞాన వివేకానంద' వర్మాల సత్యనారాయణ, 'శ్రీగురు కరుణానంద' భోగ మాధవులు ఆధ్వర్యంలో నాటి, నేటి తరాన్ని ఆకట్టుకునేలా కుల, మత భేదం లేకుండా ఈ ఆశ్రమంలో జ్ఞాన బోధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి సమస్యకు పరిష్కారంగా భగవద్గీత ఎలా ఉపయోగపడుతుందో వివరిస్తున్నారు. ఆనందంగా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండాలని, దాని కోసం నిత్యం యోగ, ప్రాణాయామ సాధన చేయిస్తున్నారు. పౌర్ణమి రోజున సత్సంగం, గురు పాదుకాపూజ నిర్వహించడంతో పాటు హాజరైనవారందరికీ భోజనం పెడుతున్నారు. ఏటా వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



సత్యనారాయణ రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు

ఆశ్రమంలో బోధనాంశాల సారం...

- ◆ దేవుడు ఎక్కడో లేడు. దయగల హృదయంలో కొలువై ఉన్నాడు. జీవుల పట్ల దయతో మెలగాలి.
- ◆ సదాచారం, సత్ప్రవర్తన, గాయత్రి మహా మంత్ర జపం, ఈశ్వరోపాసన, సత్సాంగత్యం, సత్య సహవాసం, సజ్జన సేవతో తేజస్సు, ఆత్మశక్తి కలుగుతాయి.
- ◆ శీలం, సదాచారంతో జీవించాలి. వాటితో హృదయం శుద్ధి అవుతుంది.
- ◆ అన్ని జీవులలోకెల్లా మానవ జన్మ ఉత్తమమైంది. సాధన చేసేటందుకు, ఆధ్యాత్మ ప్రాప్తమైన జీవితానికి గురువు అవసరం.
- ◆ తల్లి తొలి, విద్య నేర్పినవారు రెండో గురువు. జీవిత పరమార్థాన్ని తెలిపి, జ్ఞానజ్యోతిని వెలిగించే సద్గురువును ఆశ్రయించాలి.
- ◆ జగత్తు అంటే భూమి, ఆకాశం, గాలి, అగ్ని, నీరు. మానవదేహంలోనూ ఈ పంచభూతాలున్నాయి. ఈ పంచభూతాల అధిష్ఠాన దేవత బ్రహ్మ, పరమాత్మ.
- ◆ ప్రతి వ్యక్తీ తన జాతిని గౌరవించే విధంగా తమ సంతానాన్ని పెంచాలి.

బోధన ప్రణాళిక ఇలా...

సోమ, మంగళవారాలు: ప్రాణాయామం, యోగ సాధన
గురు, శుక్ర, శని, ఆదివారాలు: వివిధ అంశాలపై సత్సంగం
ప్రతి పౌర్ణమి రోజు: గురు పాదుకాపూజ, అన్నప్రసాదం వితరణ
ప్రతి ఏడాది: ఆశ్రమ వార్షికోత్సవం, సత్కారం

భగవద్గీత విని ప్రభావితులవుతున్నారు..


– 'సుజ్ఞాన వివేకానంద' వర్మాల సత్యనారాయణ



నా గురువులు తిరుమీదుల బాపనయ్య, కొండోజు బ్రహ్మానంద. వారి బోధనలను గ్రామ ప్రజలకు వివరించేందుకు ఆశ్రమాన్ని నెలకొల్పాం. గత నలభై ఏళ్లుగా భగవద్గీత ప్రబోధం చేస్తున్నా. సత్సంగంలో భాగవతం, గరుడ పురాణం సైతం వివరిస్తున్నాం. ప్రజలకు అర్థమయ్యేలా విజ్ఞాన రాజయోగ సారామృతం, గురు బోధామృతం, దైవ ప్రార్థన, భగవద్గీత సారామృతం, నిత్య ప్రకాశిక రచించి పంపిణీ చేస్తున్నాం. 180 మంది శిష్యులుగా చేరారు.

చేసే కర్మలోనే భగవంతుడు

– శ్రీగురు కరుణానంద భోగ మాధవులు



నిష్కామకర్మ చేయాలని, అహంకారం ఉండకూడదని, చేతనైనంత ధర్మం చేయాలని, ఇతరులకు కష్టం కల్పించకూడదని, జ్ఞానం పెంపొందించుకోవాలని, మనం చేసే కర్మలోనే భగవంతుడున్నాడని ఆశ్రమంలో నిత్యం సత్సంగంలో బోధిస్తున్నాం. ఆరోగ్యం కోసం యోగా, ప్రాణాయామం చేయిస్తున్నాం. నాకు వంద మందికి పైగా శిష్యులుగా మారారు. సన్మార్గంలో నడుస్తూ మిగితా వారిని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలు ధర్మ మార్గంలో నడిస్తేనే మానవ జీవితానికి సార్థకత.

పూదోట.. బతుకుబాట



హుజూర్‌నగర్-కోదాడ రహదారి వెంట వేసిన బంతి తోట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: భూమి లేదు కాని రైతు అయ్యాడు. ఉపాధి వెతుక్కుంటూ ఖాళీ స్థలాల్లో పూల తోటలు వేసి జీవనానికి బాట వేసుకున్నాడు హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలోని మగ్దూంనగర్‌కు చెందిన ఎస్కే అహమ్మద్. హుజూర్‌నగర్ శివారులో ఖాళీగా ఉన్న స్థలాలను కౌలుకు తీసుకొని బంతి, గులాబీ పూల తోటలు వేసి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో మంచి డిమాండ్ ఉంది. అన్ని కాలాల్లోనూ పూలు లభించేలా రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వాటిలో పూల తోటలు వేసి అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్నారు. గతంలో పూల తోట వేయక ముందు బొప్పాయి తోట, కూరగాయలు వేశారు. కానీ పెద్దగా లాభం కన్పించక పోవటంతో పూల సాగు చేస్తున్నారు. 75 రోజులలో బంతి పూలు పూస్తాయి. వీటికి కూడా పీడపీడలు వస్తుంటాయి. ఇతర పంటలతో పోల్చితే తక్కువే.

❑ మొక్కలను ఏపీలోని వివిధ ప్రాంతాలలోని నర్సరీల్లో కొనుగోలు చేసి తీసుకు వచ్చి నాటుతారు. ఎకరానికి దాదాపు రూ.12 వేల విలువ చేసే మొక్కలు నాటుతున్నట్లు **అహమ్మద్** తెలిపారు. బంతిపూలు ఎకరంలో, ఎకరన్నర భూమిలో గులాబీ మొక్కలు సాగు చేస్తున్నారు. గులాబీ మొక్కలు ఒకసారి నాటితే పూస్తుంటాయి. ఒకసారి పూల పంట చేతికందిన తరువాత వాటి కొమ్మలు కత్తిరించి మళ్లీ శుభ్రం చేస్తే అవి తిరిగి పూస్తాయి. ఈలోగా వాటిలో అంతర పంటగా బంతి, కనకాంబరాలు తరచూ చిన్న చిన్న పూలు వేసుకుంటే ఆదాయం వస్తుంటుందంటారు అహమ్మద్. ఏటా అన్ని ఖర్చులు పోనూ దాదాపు రూ.2.50 లక్షల ఆదాయం ఉంటుందని తెలిపారు. భూమి కౌలుకు తీసుకోవడం వల్ల ఖర్చు ఎక్కువ వస్తుంది కానీ లేకపోతే పూల సాగు బాగా లాభదాయకం అని చెబుతున్నారు.



ట్రస్టు సేవ.. విద్యాభివృద్ధికి తోవ



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ట్రస్టు కన్వీనర్ లచ్చయ్య (పాతచిత్రం)

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో అరబండి రామచంద్రయ్య, కనకదుర్గమ్మ ట్రస్టు విద్యాభివృద్ధి తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తమ గ్రామంలోని పేద విద్యార్థులకు సేవలందించడం లక్ష్యంగా వారి కుటుంబీకులు ట్రస్టు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దగా ఉన్న వల్లంశెట్ల లచ్చయ్య ఈ ట్రస్టు కన్వీనర్‌గా ఉండి సేవలందిస్తున్నారు. ట్రస్టు ద్వారా సేవాకార్యక్రమాల నిర్వహణకు రూ.12 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీని చదువులో ప్రతిభ చూపే పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల కోసం వెచ్చిస్తున్నారు. జాతీయ పండగలైన ఆగస్టు 15, జనవరి 26న ఏటా విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నారు. దీని కోసం ఏటా రూ.66 వేలు వెచ్చిస్తున్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.30 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించారు. ఐదారేళ్ల క్రితమే గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సౌరవిద్యుత్తు కోసం రూ.1.60 లక్షల దాకా వెచ్చించారు. పాఠశాలలో ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ట్రస్టు ద్వారా సాయం అందిస్తున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల బంద్



రిజిస్ట్రార్ అల్వాల రవికి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, తదితరులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దసరా సెలవుల అనంతరం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్ చేపడుతున్నట్లు తెలంగాణ గుర్తింపు పొందిన డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం పేర్కొంది. ఆ సంఘం ప్రతినిధులు శనివారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అల్వాల రవికి సమస్యలతో కూడిన బంద్‌కు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. అప్పులు తెచ్చి భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. నిధులు లేనప్పుడు విద్యార్థులకు విద్యాపరంగా ఏ విధంగా న్యాయం చేయగలుగుతామని తెలిపారు. దసరా సెలవుల లోపు ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే కళాశాలల బంద్ కార్యక్రమం తప్పనిసరిగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి సైదారావు, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

బుద్ధవనం సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్‌లోని బుద్ధ వనాన్ని అశోక, అంబేడ్కర్ దమ్మ యాత్ర బృంద సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ బుద్ధిస్ట్ సొసైటీ కౌన్సిల్ పూజ్య మార్య బౌద్ధ భిక్షు భారతీయ ప్రభు మాట్లాడుతూ ప్రపంచ శాంతి, బంధుత్వాన్ని కోరుతూ నిర్వహిస్తున్న ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి నాగ్‌పుర్‌లోని దీక్ష భూమి చేరుకుని, అక్కడ అశోక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బుద్ధ వనంలో ఈ బృందం బుద్ధ పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరిత వనం, జాతక పార్కు, అవకాన బుద్ధుని విగ్రహం, స్తూప పార్కు తదితర ప్రాంతాలను తిలకించారు. ఈ యాత్రలో దమ్మ కమిటీ సభ్యులు ధర్మేంద్రన్, రాజేంద్రన్, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.



బుద్ధ పాదుకల వద్ద బౌద్ధ భిక్షువులు

నారసింహుడి జన్మ నక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. ఆలయ దేవుడు నరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గర్భగుడిలో వెలసిన మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో కలశ పూజ నిర్వహించారు. నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ పర్వాన్ని కొనసాగించారు. సాయంత్రం అలంకార సేవా పర్వాన్ని మంగళవాయిద్యాల మధ్య జరిపారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ స్వాతి ఆరాధనలు నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.



స్వాతి నక్షత్రం వేడుకల్లో భాగంగా జరిపిన స్వర్ణ కలశపూజ

అంబరాన్నంటిన సంబరం.. అలరించిన రూపకం



కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తొమ్మిది అవతారాలను విద్యార్థినులు అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిషాసుర మర్దిని రూపకం అందరినీ అలరించింది. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం

65 కిలోల బంగారంతో.. స్వర్ణమయం



స్వర్ణమయంగా మారనున్న యాదాద్రి ఆలయ విమానం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రీశుల స్వర్ణ విమానానికి 65 కిలోల బంగారం కావాలి. ఇప్పటి వరకు దాతల నుంచి విరాళాల ద్వారా పదకొండు కిలోల బంగారం, రూ.20 కోట్ల నగదు చేకూరాయి. అవసరమైన బంగారం సమకూర్చి ప్రభుత్వ సూచన మేరకు అతి త్వరలోనే స్వర్ణ విమానం రూపకల్పన పనులు చేపడతామని ఆలయ ఈవో భాస్కర్‌రావు శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దాతల సహకారంతో చేకూరిన నగదు, బంగారం కాకుండా కావాల్సిన బంగారాన్ని తమ దేవస్థానం సమకూర్చేందుకు సిద్ధమని ఈవో వెల్లడించారు. ఆలయ హుండీల ద్వారా 1300 కిలోల వెండి, నగల రూపంలో వచ్చిన బంగారం ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటిని బంగారు విమాన గోపురం తయారీకి వినియోగిస్తామని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు స్వర్ణ తాపడం పనులు కమిటీ సమక్షంలో అప్పగిస్తామన్నారు. విమానం స్వర్ణమయం చేసేందుకు కూలి పనులకు రూ.3.90కోట్లు అవసరం. ఆ మొత్తాన్ని దేవస్థానం చెల్లిస్తుందన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దసరాలోపు సమావేశం కానుంది.

* గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన క్షేత్రాభివృద్ధిలో సంపూర్ణంగా కృష్ణశిలతో పంచ నారసింహులు కొలువై ఉన్న దేవాలయాన్ని పునర్నిర్మించారు. అప్పుడే గర్భాలయం పై దివ్య విమానాన్ని బంగారు కవచాలతో రూపొందిస్తామని ప్రకటించారు. పనులు రాగి తొడుగుల వరకే పరిమితమైంది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితో, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సదరు పనులు నిమిత్తం బంగారాన్ని సమకూర్చి అప్పగించేందుకు కసరత్తు చేస్తోంది.

పెరట్లో గంజాయి పెంచుతున్న వ్యక్తి అరెస్టు



ముత్యాలు ఇంట్లో పెంచుతున్న గంజాయి మొక్కలు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: రాష్ట్రమంతా గంజాయి నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగం పరుగులు తీస్తున్నా.. ఓ వ్యక్తి మాత్రం నిర్భయంగా ఎవరూ పట్టించుకోరులే అని తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు నాటి చక్కగా పెంచుతున్నాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా పోలీసులకు చేరింది. ఇంకేముంది పోలీసులు చడీచప్పుడు లేకుండా సదరు ఇంటికి వెళ్లి చూడగా 18 కిలోల గంజాయి మొక్కలు సాగు చేస్తూ దొరికిపోయాడు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం బుడ్డరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సింగం ముత్యాలు తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ తన సిబ్బందితో పాటు వ్యవసాయ అధికారి మాధవరెడ్డితో కలిసి శనివారం మధ్యాహ్నం సింగం ముత్యాలు ఇంటిని పరిశీలించారు. పెరట్లో 125 గంజాయి మొక్కలు (సుమారుగా 17.5 కిలోలు) ఉన్నట్లు కనుగొన్నారు. ఆకులు ఎండిపోతే 2 నుంచి 3 కిలోలు అవుతుందని, దాని విలువ రూ.50 వేలకు పైనే ఉంటుందని తెలుస్తోంది. పంచనామా చేసి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.

కారు బోల్తాపడి వ్యక్తి దుర్మరణం

మద్దిరాల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో జాతీయ రహదారి-365పై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన బోర్‌వెల్ యజమాని బత్తిని రవీందర్‌గౌడ్(55) తన కారులో మరో ముగ్గురితో కలిసి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రెడ్డిగూడెం శివారులో వర్షం కురవడంతో కారు అద్దాల్లోంచి దారి కనిపించక వాహనం అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కారు నడుపుతున్న బత్తిని రవీందర్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు స్వల్పగాయాలతో బయట పడ్డారు. బోల్తా పడిన కారును క్రేను సహాయంతో పోలీసులు బయటకు తీసి మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ఆలేరు, న్యూస్‌టుడే: నాన్నమ్మ నెల మాసికం ముగించుకుని వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన శనివారం ఆలేరులో జరిగింది. స్థానిక ఎస్సై రజనీకర్, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజపేట మండలం సోమారం గ్రామానికి చెందిన తమ్మడి హరిగణేశ్(30) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటున్నాడు. డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాన్నమ్మ నెల మాసికం ఉండటంతో శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఉప్పల్‌కు తిరుగు పయనమయ్యాడు. ఆలేరు సాయిబాబా గుడి సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరే క్రమంలో .హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న ఆర్టీసీ గరుడ బస్సు బలంగా ఢీకొట్టింది. హరిగణేశ్ తలకు గాయమైంది. 108 అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చిన కొద్దిసేపటికే మృతి చెందాడు. తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆర్టీసీ బస్సు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చెప్పారు.

నల్గొండ
• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

సమర్థంగా నిర్వహించాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: ఎలాంటి పొరపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని నకిరేకల్ తహసీల్దారు జమీరుద్దీన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో జానీ మియా కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఐకేపీ, పీఏసీఎస్ అధికారులు, సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం నరహరి, సీఈవో జగన్‌మోహన్ రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

మర్రిగూడ: గర్భిణులు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అంగన్‌వాడీ పర్యవేక్షకులు యశోద అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కుదాభక్షపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి, అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని మునుగోడు రోడ్డు హౌసింగ్‌బోర్డుకాలనీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి మురుగు కాల్వలు పూర్తిగా దెబ్బతినిపోయింది. కొత్త కాల్వ నిర్మించి మురుగు సమస్య పరిష్కరించాలి. – మల్లికార్జున్, నల్గొండ.

✔ స్థానిక కౌన్సిలర్ ప్రతిపాదనల మేరకు కౌన్సిల్ నిధులు మంజూరు చేస్తుంది. తదుపరి కాల్వల నిర్మాణ పనులు చేపడుతాం. – రాములు, ఈఈ, నల్గొండ పరపాలిక.

మద్య నిషేధం అమలు చేస్తే రూ.5లక్షలు

మునుగోడు, న్యూస్‌టుడే: గొలుసు దుకాణాలను నిర్మూలించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో గ్రామాల్ని ప్రశాంతంగా ఉన్నాయని డీసీసీబీ వైస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలం కొంపల్లి గ్రామంలో గొలుసు దుకాణాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని.. కొంపల్లి గ్రామంలో పూర్తిగా మద్య నిషేధం అమలు చేస్తే వెదిరే పూలమ్మ ఫౌండేషన్ తరపున రూ.5 లక్షలు నగదును అందజేస్తామని ఆ ఫౌండేషన్ ఛైర్మన్ వెదిరే మేఘారెడ్డి ప్రకటించారు.


కొంపల్లి గ్రామంలో మద్యాన్ని పూర్తిగా నిర్మూలిస్తే రూ.5 లక్షలు నగదును అందజేస్తామని ప్రకటిస్తున్న వెదిరె పూలమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మేఘారెడ్డి

గ్రామీణ ఓటర్లు 2,16,874


గ్రామ పంచాయతీ కార్యాలయం

నకిరేకల్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను తాజాగా అధికారులు విడుదల చేశారు. నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 126 గ్రామ పంచాయతీల్లోని 1200 వార్డుల్లో మొత్తం 2,16,874 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,07,584, మహిళలు 1,09,287, ఇతరులు ముగ్గురు ఉన్నారు. నియోజకవర్గంలో రామన్నపేట మండలంలో అత్యధికంగా 44,617 మంది, నకిరేకల్ మండలంలో అత్యల్పంగా 26,319 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నకిరేకల్	17	13,054	13,263	02	26,319
రామన్నపేట	24	22,401	22,216	00	44,617
చిట్యాల	18	17,627	17,704	00	35,331
నార్కట్‌పల్లి	29	21,136	21,810	01	42.947
కట్టంగూరు	22	18,415	18,604	00	37,019
కేతేపల్లి	16	14,951	15,690	00	30,641

చిట్యాల వాసికి ఓయూ డాక్టరేట్

చిట్యాల, న్యూస్‌టుడే: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి చిట్యాలకు చెందిన శేపూరి విజయలక్ష్మి డాక్టరేట్ పట్టాపొందారు. ఇటీవల ఓయూ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత అధికారులు విజయలక్ష్మికి డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఆమె తల్లిదండ్రులు శేపూరి యాదయ్య(జడ్పీలో కాంగ్రెస్ మాజీ విప్),పూలమ్మ. ప్రొఫెసర్ ఏ.కృష్ణశైలజ పర్యవేక్షణలో ఫార్మసీ విభాగంలో 'ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ గ్యాస్ట్రో రిటెన్టివ్ ఫ్లోటింగ్ మైక్రో స్పియర్స్ ఆఫ్ యాంటీ హైపర్ టెన్సివ్ డ్రగ్స్' అనే అంశంపై విజయలక్ష్మి పరిశోధనచేసి సమర్పించిన పత్రాలకుగాను ఆమెకు డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె ఓ ప్రైవేటు విద్యా సంస్థలో ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకోవడంపట్ల తల్లిదండ్రుల తోపాటు భర్త మర్రి సునీల్, సోదరి శైలజదివాకర్, ఇతర కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు.


ప్రొఫెసర్ కృష్ణశైలజతో శేపూరి విజయలక్ష్మి

డ్వాబ్‌కు రూ.50వేలు చెక్కు అందజేత

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసిన తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు డవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థకు రూ.50 వేలు చెక్కును అందచేశారు. అంతర్జాతీయ వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఈ నెల 1న హైదరాబాద్‌లో డ్వాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు శనివారం హైదరాబాద్‌లో డ్వాబ్ ప్రధానకార్యదర్శి పొనుగోటి చొక్కారావుకు రూ.50వేలు చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమాల్లో డ్వాబ్ అధ్యక్షుడు జి.అజిత్‌కుమార్, కోశాధికారి ఎన్.పరమేశ్ పాల్గొన్నారు.


డ్వాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావుకు రూ.50వేలు చెక్కు అందజేస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు

బతుకమ్మ సంబురాలు


నకిరేకల్: పీఆర్టీయూ భవన్‌లో బతుకమ్మ సంబురాల్లో మహిళా ఉపాధ్యాయులు


నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకొంటున్న విద్యార్థులు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పీఆర్టీయూటీఎస్ భవన్‌లో కస్తూరి ఫౌండేషన్ సహకారంతో బతుకమ్మ సంబురాలను శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండల గౌరవ అధ్యక్షురాలు కడారు అనిత, డా.సుష్మ, నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం మండలాల మహిళా ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి గ్రామీణం: నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తువులు ధరించి బతుకమ్మలను ప్రత్యేకంగా తయారు చేసి ఆటపాటలతో ఆనందంగా జరుపుకున్నారు. ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు సుల్తాన, వెంకటేశ్వర్లు, ప్రకాష్, అంజిబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నల్గొండ: రామగిరిలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేస్తున్న భవాని స్వాములు


నల్గొండ: వివేకానందనగర్‌లో నిర్వహించిన పూజలో భక్తులు..


నల్గొండ: పూజలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ రమేష్‌గౌడ్

సంక్షిప్త సమాచారం

కరపత్రాలు ఆవిష్కరణ... నకిరేకల్: పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా పూర్వ కార్యదర్శి చెరుకు సతీశ్ కోరారు. నకిరేకల్‌లో ఉత్సవాల ప్రచార కరపత్రాలు శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 21న నల్గొండలో, 24న ఓయూలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరు సాగర్, అంబటి చిరంజీవి, సైదులు, పి.అనిల్, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి... శాలిగౌరారం: అడ్లూరు శివారులో జూద శిబిరంపై పోలీసులు శనివారం దాడిచేశారు. జూదం ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,600 నగదు, 14 ద్విచక్రవాహనాలు, 11 చరవాణిలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై డి.సైదులు తెలిపారు. మరో ఆరుగురు నిందితులు పరారయ్యారని వివరించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయత పెరగాలి... నీలగిరి: విద్యార్థుల్లో శాస్త్రీయ అంశాలపై అవగాహన పెంచడం కోసం జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందని వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రకృతి పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ శాస్త్రీయతను పెంచాలన్నారు. వేదిక అందించే చెకుముకి మాస పత్రిక పరీక్షలు అందరు రాసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విమల, సైదులు, శంకర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మహిళాకార్మికులకు చీరలు, నగదు అందజేత... చిట్యాల: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్యాల పురపాలికకు చెందిన 24మంది మహిళాకార్మికులకు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, భాజపా నాయకుడు కూనూరు సంజయిదాస్‌గౌడ్ ఒక్కొక్కరికి చీరతోపాటు అందరికి కలిపి రూ.5వేలు శనివారం తన నివాసంలో అందజేశారు. మిగిలిన కార్మికులు, సిబ్బందికి రూ.10వేలు అందజేశారు. దసరా పండుగను సరదాగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. జడల నరసింహ, రాజు, ప్రశాంత్, జ్యోతి పాల్గొన్నారు.

నివాళి... చిట్యాల గ్రామీణం: మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన పైళ్ల నర్సిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం సినియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, మల్లం మహేశ్, అరూరి శ్రీనివాస్, నెల్లికంటి నర్సింహ, పంది నరేశ్‌లు శనివారం నర్సింరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అన్నపూర్ణదేవిగా అమ్మవారు..


కనగల్: గాయత్రి దేవిగా దర్వేశిపురంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారు

నీలగిరి, న్యూస్‌టుడే: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగాంగా శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. 108 రకాల ప్రసాదాలను తయారు చేసి అమ్మవారికి నివేదించారు. కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి మండపాల నిర్వాహకులు భక్తులకు, స్వాములకు అన్నప్రసాదం అందజేశారు.

గట్టుప్పల: మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి దేవస్థానంలో గట్టుప్పల జడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నాంపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలపరిధిలోని గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారిని భక్తులు శనివారం అన్నపూర్ణాదేవీ అలంకరణలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి.. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.


చిట్యాలలో గుత్తా అమిత్‌రెడ్డి, వేముల పుష్ప, తదితరులు


కట్టంగూరు: చెర్వుఅన్నారంలో...

ఎంజీయూలో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ఎంపిక

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ఎంపిక రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపాలని కోరారు. ప్రతి విద్యార్థి సామాజిక సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ విధాలుగా పోటీలు నిర్వహించి.. ప్రతిభ గల వారిని ఎంపిక చేశారు. ఈ విద్యార్థులు త్వరలో మహారాష్ట్రలో జరిగే వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ పి.మద్దిలేటి, నరసింహ, సంజయ్, హరి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.


ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ఎంపికను ప్రారంభిస్తున్న రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, తదితరులు

కల్యాణ వేడుకలు

కట్టంగూరు, న్యూస్‌టుడే: కట్టంగూరులో శ్రీకంఠ మహేశ్వరస్వామి-సురమాంబదేవి కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గౌడ సామాజిక వర్గం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలలో భాగంగా శనివారం గ్రామదేవతలకు శాంతి పూజలు జరిపారు నైవేద్యం సమర్పించేందుకు బోనాలు, మొకుముస్తాదులు గంపలలో పెట్టి డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి వెళ్లారు. శనివారం రాత్రికి కల్యాణ వేడుకలు ప్రారంభమై, ఆదివారం తెల్లవారుజామున ముగుస్తాయని గౌడ సంఘం కమిటి తెలిపింది.


కట్టంగూరు: బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

చిట్యాల, న్యూస్‌టుడే: ఈనెల 10వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించిన నేపధ్యంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది తదనుగుణంగా సన్నద్ధం అవుతున్నారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ గోదాములు ఈమేరకు ధాన్యం తూకం వేసే యంత్రాలకు అవసరమైన మరమ్మతులు శనివారం మొదలు పెట్టారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో చిట్యాల మండలంలోని సగభాగంతోపాటు నార్కట్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలు ఉన్నాయి. మార్కెట్ పరిధిలో ప్రతి పంటసీజన్‌లో ఏర్పాటుచేయనున్న 31 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యంతూచే యంత్రాలు, టార్పాలిన్లు, గోనెసంచులు, తేమ కొలిచే యంత్రాలను మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి సమకూర్చుతుంటారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి గోదాములో భద్రపరిచిన తూకపు యంత్రాలకు అవసరమైన చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రస్తుతం తూకపు యంత్రాలు 103 అందుబాటులో ఉండగా మరో 20 కావాలని తమపై అధికారులను అభ్యర్థించామని మార్కెట్ కమిటీ కార్యదర్శి జానయ్య పేర్కొన్నారు. 425 టార్పాలిన్లు ఉండగా మరో 500 కావాలని కోరామని, తేమను పరీక్షించే యంత్రాలు 57 ఉన్నాయని, అదనంగా 30 కావాలని, ధాన్యం పొట్టు వలిచే యంత్రాలు 40, ధాన్యం సన్నరకమా? దొడ్డ రకమా పరీక్షించే యంత్రాలు 40కావాలని అధికారులను కోరామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే నాటికి తమపరంగా అన్ని విధాల సంసిద్ధమై ఉండడానికి సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు.


చిట్యాల వ్యవసాయ మార్కెట్ గోదాములో తూకపు యంత్రాలకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చండూరు, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చండూరు పురపాలిక పరిధిలోని అంగడిపేటలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగడిపేటకు చెందిన బొల్లం శ్రీను(52) నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చిందని చండూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షలు నిర్వహించిన సిబ్బంది రక్త కణాలు తగ్గాయని చికిత్స అందించారు. శనివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో నల్గొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడని మృతుని బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బలగాలను మోహరించారు. ఇదిలా ఉండగా ఇరు వర్గాలకు పెద్ద మనుషుల సమక్షంలో పోలీసుస్టేషన్‌లో రూ.3లక్షలకు రాజీ కుదరినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై వెంకన్నను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా స్పందించలేదు.


బొల్లం శ్రీను

అంత్యక్రియల్లో కోమటిరెడ్డి సోదరులు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిల చిన్నమ్మ కోమటిరెడ్డి లక్ష్మమ్మ(90) అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం స్వగ్రామం నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంలలో ఆమె అంత్యక్రియలు నిర్వహించిన సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే పాడెమోశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉశయ్య, నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి, జేరిపోతుల భరత్, బొడిగే స్వామి తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణవెల్లంలలో పాడెమోస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఆర్టీసీ అమరవీరుల సంస్మరణ దినం


నల్గొండ డిపోలో ఆర్టీసీ అమర వీరులకు నివాళి అర్పిస్తున్న జేఏసీ నాయకులు

నల్గొండ గ్రామీణం: ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్గొండ డిపో ఆధ్వర్యంలో ఆర్టీసీ అమర వీరుల సంస్మరణ దినాన్ని శనివారం నిర్వహించి నివాళి అర్పించారు. 2019లో జరిగిన ఆర్టీసీ పరిరక్షణ, న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిపిన 55 రోజుల సమ్మెలో 32 మంది కార్మికులు ఆత్మ బలిదానానికి ఆ రోజు ప్రభుత్వం ప్రదర్శించిన నిరంకుశ వైఖరికి నిదర్శనం అన్నారు. వారి ఆశయాల సాధనకు జేఏసీ ఆధ్వర్యంలో సమష్టిగా ఉద్యమిస్తామన్నారు. నాయకులు కెఎస్‌రెడ్డి, వెంకటయ్య, నరేందర్, చంద్రయ్య, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చరు.. బారికెడ్ తొలగించరు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: చిత్రంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న బారికెడ్ నెలల తరబడి ఎక్కడేసింది అక్కడే ఉంటుంది. రోడ్డు మీద కాస్త చిన్న గుంత ఉండటంతో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా దీనిని ఏర్పాటు చేశారు. నెలలు గడుస్తున్నా చిన్న గుంతను సరిచేయకుండా అలానే ఉంచారు. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉంటుంది. నల్గొండలోని శివాజీనగర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రధాన రహదారికి లింకుగా ఉన్న ఈ రోడ్డు మూలమలుపు వద్ద బారికెడ్ ఏర్పాటు చేశారు. చిన్న సమస్యను పరిష్కరించకుండా ఉండటంతో మూల మలుపు వద్ద ఎడమవైపు వెళ్లాలనుకునే వారు రోడ్డుకు మధ్యలో ఉండి తిరగాల్సి ఉంటుంది. ఇది నల్గొండలోని శివాజీనగర్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రధాన రహదారికి లింకుగా ఉన్న రోడ్డు వద్ద ఈ పరిస్థితి. మూల మలువు వద్ద ఇది నెలల తరబడి అలానే ఉండటంతో వాహనాదారులకు కొంత ఇబ్బంది కరంగా ఉంటుంది. సమస్యను త్వరితగతిన పరిష్కరించడం వల్ల మూల మలుపు వద్ద వాహనాలు సులువుగా వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది.


నల్గొండలోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి శివాజీనగర్‌కు వెళ్లే దారిలో మూలమలుపు వద్ద అడ్డుగా ఉంచిన బారికెడ్

చేపల వేటకు వెళ్లి మత్స్యకార్మికుడి...

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ఓ మత్స్యకార్మికుడు మృతి చెందిన ఘటన నార్కట్‌పల్లి మండలంలోని తొండల్‌వాయిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు... తొండల్‌వాయికి చెందిన చిల్ల సైదులు(55) ఆ గ్రామం శివారులోని వల సహాయంతో చేపలు పడుతుండంగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. ఈ విషయమై ఎస్సై క్రాంతి కుమార్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.


సైదులు

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** సత్యం సుందరం, **వెంకటేశ్వర:** శ్వాగ్, **పీవీఎన్:** రామ్‌నగర్ బన్నీ
నకిరేకల్: **రామకృష్ణ-** శ్వాగ్, **వెంకటేశ్వర-** దేవర


వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

తిప్పర్తి, న్యూస్‌టుడే: ఇండ్లూరు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇండ్లూరు గ్రామానికి చెందిన బసవోజు సైదాచారి(41) చిన్నతనం నుంచి మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. ఎవరికి చెప్పకుండా శనివారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై లింగయ్య తెలిపారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా.. రాకపోకలకు అంతరాయం

కేతేపల్లి, న్యూస్‌టుడే: ఇనుపాముల సమీపంలో శనివారం సాయంత్రం ఓ కారు టైరు పగిలి బోల్తా కొట్టి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో జాతీయ రహదారిపై సుమారు అరగంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న కారు ఇనుపాముల స్టేజీ సమీపంలోకి రాగానే ముందు టైరు పగలడంతో బోల్తా పడి రహదారికి మధ్యలో నిలిచిపోయింది. బెలూన్లు తెరుచుకోవడంతో ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు కారును పక్కకు తప్పించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి


వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్ర పటానికి అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటు సభ్యునిగా వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేసంగా కృషి చేశారని పేర్కొన్నారు.

నకిరేకల్: జి.వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని మండల పరిషత్‌లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ఎంపీడీవో ఏ.చంద్రశేఖర్, ఎంఎవో జానీమియా, ఏపీవో రమణయ్య, ఏపీఎం నరహరి, సీసీలు కె.మట్టయ్య, పద్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్రిగూడ: గడ్డం వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈద అభిసందేశ్, మారయ్య, రఘు, రాంచరణ్, శివరాజ్ ఉన్నారు.

చిట్యాల: మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని చిట్యాల మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ జయలక్ష్మి, వ్యవసాయాధికారి పైడిమర్రి గిరిబాబు, ఉపాధిహామీ ఏపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


వెంకటస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్గొండ అర్బన్: మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి (కాక) 95వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఎస్పీ శరత్ చంద్ర పవార్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి సేవలను ఎస్పీ కొనియాడారు.

మిర్యాలగూడ

• మిర్యాలగూడ • నాగార్జునసాగర్ • దేవరకొండ


దేవరకొండ పట్టణంలో ఆత్మీయ హిందూ సమ్మేళనంలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలన్

ఆత్మీయ హిందూ సమ్మేళనం

దేవరకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ పట్టణంలో ఆత్మీయ హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ నుంచి స్వయం సేవకులు పథసంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పుర వీధుల గుండా ఆర్‌ఎస్‌ఎస్ సేవకులకు అడుగడుగునా మహిళలు పూలవర్షం కురిపించారు.

దేవరకొండ, న్యూస్‌టుడే:

? దేవరకొండ పట్టణంలో సీసీ రహదారులు నిర్మాణం చేపట్టడం లేదు. వీలైనంత త్వరగా రోడ్లు నిర్మించాలి.
–కె.జనార్ధన్, దేవరకొండ

✔ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం..
భాస్కర్‌రెడ్డి, పురపాలిక కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే :

? పట్టణంలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు లేక అనేక అవస్థలు పడుతున్నాం.
శ్రీనివాస్, మిర్యాలగూడ.

✔ సీసీ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం: ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ.

చింతపల్లి, న్యూస్‌టుడే:

? మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేవు. విద్యుత్తు వృథా అవుతోంది. –స్థానికుడు

✔ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
– మురళీకృష్ణ, ఏఈ

మురుగు పారేదెలా...?


పీఏపల్లిలో ఇళ్ల ఎదుట నిలిచిన నీరు

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: పీఏపల్లి మండల కేంద్రంలో మురుగు కాల్వల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చిన్నపాటి వర్షానికి సైతం వీధులన్నీ జలమయమవుతున్నాయి. ఇటీవల ప్రధాన వీధిలో నిర్మించిన సీసీ రహదారికి ఇరువైపులా మురుగుకాల్వలు సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు పెద్దమొత్తంలో పక్కనున్న లోతట్టు ఇళ్లలోకి చేరుతున్నాయి. పలు చోట్ల ఇళ్ల ప్లాట్లు కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ఆయా వీధుల్లో దోమలు విపరీతంగా పెరగడంతో పాటు దుర్వాసనతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ప్రత్యేకాధికారి చంద్రమౌళిని వివరణ కోరగా సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బదిలీలు సక్రమంగా జరిగేనా..?

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: బదిలీల విషయంలో ఉన్నతాధికారుల నిఘా ఎక్కువగా ఉండటంతో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇటీవల విద్యుత్‌శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే చోట రెండు సంవత్సరాలు విధులు పూర్తైన వారిలో 50 శాతం మందిని బదిలీ చేసేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ క్రమంలో కొండమల్లేపల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో దేవరకొండ, నాగార్జునసాగర్, మునుగోడు నియోజకవర్గాలకు చెందిన కొండమల్లేపల్లి, దేవరకొండ, చందంపేట, నేరడిగొమ్ము, డిండి, పీఏపల్లి, చింతపల్లి, గుర్రంపోడు, నాంపల్లి, మర్రిగూడ మొత్తం పది మండలాలున్నవి. డివిజన్‌లో రెండు


కొండమల్లేపల్లిలో గల డీఈ కార్యాలయం.

సంవత్సరాలు పూర్తైన ఉద్యోగులు సుమారు 80 మంది ఉండగా వారిలో 9 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లు, 28 మంది లైన్‌మెన్లు, ఒకరు జేఎల్‌ఎమ్, ఒకరు ఏఎల్‌ఎమ్, ఒకరు స్వీపరు మొత్తం 40 మంది ఉద్యోగుల బదిలీకి ఐదు రోజుల క్రితం డీఈ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కొంత మంది ఉద్యోగులు పైరవీలు, పలుకుబడి ఉపయోగించి తమకు నచ్చిన చోటకి బదిలీ చేయించుకున్నారనే ఆరోపణలు రావడంతో విద్యుత్ ఉద్యోగ సంఘాల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సంబంధిత అధికారులు మొదట జారీ చేసిన జాబితాను రద్దు చేసి రెండు రోజుల కింద తిరిగి మరో జాబితాను విడుదల చేశారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు

విద్యాసాగర్: డీఈ, కొండమల్లేపల్లి

అధికారుల ఆదేశానుసారం నిబంధనలు పాటిస్తూ దేవరకొండ విద్యుత్ డివిజన్‌లో 40 మంది ఉద్యోగుల బదిలీకి గాను గురువారం జాబితా విడుదల చేశాం. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా.. పారదర్శకతను పాటిస్తూ బదిలీ ప్రక్రియ సాగేలా చర్యలు తీసుకుంటాం.



అస్తవ్యస్తం.. అవస్థలమయం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ రెవెన్యూ డివిజన్ కేంద్రం, పురపాలికలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. అండర్ డ్రైనేజీ, మిషన్ భగీరథ పేరిట రోడ్లు ధ్వంసం చేసి నేటికి ఐదేళ్లు గడుస్తున్నా నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. రోడ్డు ప్రమాదాలతో అనేక మంది క్షతగాత్రులుగా మారారు. ఈ విషయంపై ఏఈ రాజును వివరణ కోరగా అంతర్గత రహదారుల నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు.


దేవరకొండ స్వర్ణకార వీధిలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

పెద్దమూలవాసికి డాక్టరేట్ ప్రదానం



చందంపేట: చందంపేట మండలం పెద్దమూల గ్రామానికి చెందిన **చాట్ల ఇద్దయ్య** భౌతికశాస్త్రం విభాగంలో ' స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్, మ్యాగ్నటిక్ అండ్ ఐరన్ మాస్బర్ స్టడీ ఆఫ్ హోల్మియా ఐరన్ ఆక్సైడ్ బెస్ట్ మ్యాగ్నెటో ఎలక్ట్రిక్ మల్టీ ఫెరాలిక్ మెటీరియల్స్' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, ఆడిట్ సెల్ డాక్టర్ ఎం.శ్రీనాధ్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ మేరకు శనివారం ఓయూ అతనికి డాక్టరేట్ ప్రదానం చేసింది.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** దేవర, **శ్రీనివాస:** శ్వాగ్
విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, సత్యం సుందరం, శ్వాగ్

ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థల పరిశీలన


మొల్కచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం స్థల పరిశీలన చేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోసిన్‌బిన్ అహ్మద్

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: వానాకాలానికి సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. మరి కొద్ది రోజుల్లో వరి కోతలు మొదలు కానున్న నేపథ్యంలో దసరా పండగ తర్వాత కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. మండల పరిధిలో ఉల్సాయిపాలెం, మొల్కచర్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు సంబంధించి ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోసిన్‌బిన్ అహ్మద్ స్థల పరిశీలన చేశారు. సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఎంపీడీవో కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏవో సరిత, ఏపీఎం శేషయ్య, వీవోఏలు ఉన్నారు.

కాల్వకు గండి... ఆందోళనలో రైతులు


త్రిపురారం మండలం బెజ్జికల్ శివారులో ఎల్-2 కాల్వకు గండి పడటంతో వృథాగా పోతున్న నీరు

త్రిపురారం, న్యూస్‌టుడే: ముదిమాణిక్యం మేజర్ కాల్వ ఎల్-4 పరిధిలోని ఎల్-2 కాల్వకు బెజ్జికల్ శివారులోని ఉప్పలమైసమ్మ గుడి సమీపంలో నాలుగు రోజుల క్రితం గండి పడింది. దీంతో నీరంతా వృథాగా తుంగపాడు బంధంలో కలుస్తుంది. ఈ విషయాన్ని గ్రామస్థులు ఎన్నెస్పీ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. గండి పడటం వల్ల అల్వాలపాడు తండా, చెన్నాయిపాలెం, లావూడితండా గ్రామాలకు చెందిన చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎన్నెస్పీ డీఈ కేశవ్‌ను సంప్రదించేందుకు ఆయన చరవాణికి ఫోన్ చేయగా స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి గండి పూడ్చి చివరి భూములకు నీరందే విధంగా చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట పొలాన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు


చింతపల్లిలో వరి పంట పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ రైతు వరి పొలాన్ని కృషి విజ్ఞాన కేంద్రం కంపసాగర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. మండల కేంద్రానికి చెందిన కొడారి వెంకటయ్య, కేతావత్ సోమ్లానాయక్‌కు చెందిన వరి పొలాలు 45 రోజులకే పొట్టకొచ్చినట్లు వ్యవసాయాధికారులు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువెళ్లారు. తక్కువ నెలలకే పంట చేతికి రావడంతో నివేదికను జిల్లా వ్యవసాయాధికారికి అందించనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కంపసాగర్ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.శివప్రసాద్, చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారిణి శ్రావణ కుమారి, నర్సింహ, మధు, మౌనిక, కార్తీక్‌రెడ్డి ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

త్రిపురారం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ, సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదంటూ గ్రామానికి ఇరిగి క్రాంతి కుమార్ ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శనివారం డీఎల్పీవో రాఘవరావు గ్రామానికి వచ్చి నిధులపై విచారణ చేసి గ్రామ పంచాయతీ దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. గులాం అలీ, పంచాయతీ కార్యదర్శి జాఫర్, రమేష్ సింగ్, వేణు, సతీష్, బాలకృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

సన్నాలకే పంట బోనస్

డిండి: సన్నరకం వరి ధాన్యానికే ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రావణ్‌కుమార్ అన్నారు. డిండి మండలంలోని బొల్లనపల్లిలో వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. రైతులు నాణ్యత ప్రమాణాలు


బొల్లనపల్లిలో వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్

పాటించి.. వారి పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. అనంతరం డిండి, చెర్కుపల్లిలో ఉన్న విత్తనోత్పత్తి కేంద్రాలను సందర్శించారు. ఏడీఏ నివేదిత, ఏవోలు వెంకన్న, రామలింగేశ్వర్ రావు, మాధవిలత, సత్తార్, పరమేశ్వరి పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ సందర్శన

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పట్టణంలోని భారత ఆహార సంస్థ కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ నర్సింహా రాజు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐలో దస్త్రాలను పరిశీలించి, గోదాముల్లో నిల్వలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. జీఎంను హమాలీ సంఘ నాయకులు ధనావత్ బిక్షా నాయక్, మాళోతు లాలు నాయక్ కలిసి పలు సమస్యలను వివరించారు. అనంతరం జీఎంను శాలువా పూల మాలతో సత్కరించారు. రామారావు, కృష్ణ, చిన్నరవి, చందర్, విజయ్, ఛత్రు, శంకర్ పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం

డిండి, న్యూస్‌టుడే: డిండి, చెర్కుపల్లి విత్తనోత్పత్తి కేంద్రాల్లో గత ఏడాది ఉత్పత్తి చేసిన (పీఆర్‌జీ-176) రకం కందులు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 9న వేలం వేయనున్నట్లు వ్యవసాయాధికారి రామలింగేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిండిలో 55.38 క్వింటాళ్లు, చెర్కుపల్లిలో 12 క్వింటాళ్ల నిల్వ ఉన్నట్లు తెలిపారు.

నీటి సరఫరాలో నేడు అంతరాయం

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణానికి ఆదివారం మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం నెలకొంటుందని పురపాలిక కమిషనర్ భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపూజీనగర్ సంపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందని.. పట్టణ ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడాలని సూచించారు.

విద్యుత్తు సరఫరాలో..

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పట్టణ విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ కోడిరెక్క రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ రహదారి, బంగారుగడ్డ, రామచంద్రగూడెం, తాళ్లగడ్డ, రాంనగర్, సీతారాంపురం, చైతన్యనగర్, గాంధీనగర్, రెడ్డికాలనీ, అశోక్‌నగర్, డాక్టర్స్ కాలనీ, ఇస్లాంపురం, వినోభానగర్, వాసవీ నగర్, టాకా రోడ్డు, కృష్ణాకాలనీ, మెయిన్ బజార్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

మాడ్గులపల్లి: మాడ్గులపల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీత్యాతండా, లక్ష్మీదేవిగూడెం, పాములపహాడ్, తడకమళ్ల, మొల్కపట్నం గ్రామాల పరిధిలో మూడు ఫేసుల విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


త్రిపురారంలో అన్నదానం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హనుమాన్‌పేటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో శ్రీ దేవి శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శనివారం పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు. పట్టణంలోని ముత్తిరెడ్డి కుంటలో ఏర్పాటు చేసిన దుర్గ నవరాత్రి వేడుకల్లో ముస్లిం సోదరులు ఎం.ఎ అలీమ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ గ్రామీణం: యాద్గార్‌పల్లిలో శ్రీ కనకదుర్గ దేవాలయం గర్భాలయంలో కొలువుదీరిన అమ్మవారికి శనివారం అన్నపూర్ణ దేవి అలంకరణ చేశారు. ఆలయ కమిటీ బంటు వెంకటేశ్వర్లు, గౌరు శ్రీనివాస్, రామకృష్ణ, ప్రతాప్, శివ, మణిదీప్, రవి, వెంకన్న పాల్గొన్నారు.

త్రిపురారం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ వారు శనివారం భక్తులకు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం వారు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మిర్యాలగూడ గాంధీనగర్‌లో...


అడవిదేవులపల్లిలో..

చింతపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరనగర్‌లోని దేవాలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వురె లక్ష్మణ్, భాస్కర్, నగేష్ పాల్గొన్నారు.


చింతపల్లిలో...

అడవిదేవులపల్లి: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న పూజల్లో మూడోరోజు మండల కేంద్రంలోని మహిషాసుర మర్ధిని ఆలయంలో కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహింపజేసి ఆహుతులైన భక్తులకు ఆలయ పూజారి వెల్లటూరి రామ్మోహన్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుర్గామాతకు 101 రకాల నైవేద్యం సమర్పణ

దేవరకొండ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్త మార్కండేయస్వామి దేవాలయంలో 101 మంది మహిళా భక్తులు 101 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు.



అనంతరం అభిషేక సహస్రనామ పూజలు ఘనంగా నిర్వహించారు. గణేష్‌నగర్‌లో దుర్గామాత వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాకా ఆశయాలు సాధించాలి: బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన గడ్డం వెంకటస్వామి (కాకా) ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. కాకా జయంతిని పురస్కరించుకుని శనివారం మిర్యాలగూడలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. నూకల వేణుగోపాల్‌రెడ్డి, రవి, శౌరి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి (కాకా) జయంతి కార్యక్రమం పురపాలిక కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ, కమిషనర్ యూసుఫ్ కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుర సిబ్బంది శ్వేతారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డిండి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో వెంకట్, రాగ్యానాయక్, నర్సింహ, శివ పాల్గొన్నారు.


మిర్యాలగూడలో గడ్డం వెంకటస్వామి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

నిడమనూరు వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం

నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ వ్యవసాయ, సహకార (మార్కెటింగ్) శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి చందర్‌రావు తెలిపారు. మార్కెట్ ఛైర్మన్‌గా నిడమనూరు మండలంలోని పార్వతిపురం గ్రామానికి చెందిన ప్రస్తుత కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న అంకతి సత్యం, వైస్ ఛైర్మన్‌గా త్రిపురారం మండలం దుగ్గిపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియామకం అయ్యారు. మిగిలిన 16 మంది సభ్యులుగా మన్నెం శంకర్, పాల్వాయి చంద్రశేఖర్‌రెడ్డి, మెండె వెంకటేశ్వర్లు, వంగాల అనిల్‌రెడ్డి, సపావత్ శ్రీను, ఎండీ యాకూబ్, పొలగాని పరుశురామ్, అనుముల మంజుల, కూరపాటి సైదులు, గంగుల గురువయ్య, రేపాల మధుసుధన్, బెల్డె అశోక్, వీరితో పాటు త్రిపురారం ప్యాక్స్ ఛైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఏడీఏ హాలియా, నిడమనూరు గ్రామ పంచాయతీ పత్యేక అధికారి హోదాలో కొనసాగుతున్న వారు కూడా సభ్యులుగా ఉంటారు. ఉత్తర్వులు ప్రకారం ఈ పాలకవర్గం ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుంచి రెండేళ్ల పాటు వారి ఆ హోదాలో కొనసాగనున్నారు.


ఛైర్మన్ అంకతి సత్యం


వైస్ ఛైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

భూమి పూజ

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో నూతనంగా నిర్మించనున్న హన్మాన్ దేవాలయ నిర్మాణానికి శనివారం నిర్వాహకులు భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు రవి, చీమల వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

బాధాకరం

డిండి, న్యూస్‌టుడే: డిండి మండల జాల్‌తండాకు చెందిన బిక్యానాయక్ మృతి బాధాకరమని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య అన్నారు. శనివారం బిక్యనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఐ నాయకులు వెంకటరమణ, బుచ్చిరెడ్డి, కనకచారి, శైలేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవరకొండ, న్యూస్‌టుడే: అంగన్‌వాడి టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమతమ్మ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన విధంగా కనీస వేతనం రూ.18వేలు ప్రతి నెల మొదటి వారంలో చెల్లించాలన్నారు.

కనుల పండువుగా బతుకమ్మ సంబరాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని డాక్టర్ అలూకా జైహింద్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ ధన్‌రాజు, వాసురాం, రామస్వామి, లింగస్వామి, లావణ్య, పాల్గొన్నారు.


చింతపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

రహదారి ప్రమాదంలో ఒకరు మృతి

దామరచర్ల, న్యూస్‌టుడే: నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై దామరచర్ల మండలం బొత్తలపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వాడపల్లి ఎస్సై ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం చెరువుతండాకు చెందిన బాణావత్ సిపాయి యాదాద్రి పవర్ ప్లాంటు (వైటీపీఎస్)లో అద్దె ప్రాతిపదికన బొలెరో వాహనం నడిపిస్తున్నారు. విధులు ముగిసిన అనంతరం దామరచర్లకు చేరుకున్నారు. అదే గ్రామానికి చెందిన బాణావత్ సాయి, బానావత్ నితిన్ బాబులను వాహనంలో ఎక్కించుకుని హైవేపై రాళ్లవాగుతండా దాబా వైపు వెళ్తుండగా బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్(విభాగిని) దాటుకుంటూ అవరోహ క్రమంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో గుంటూరు వైపు వెళ్తున్న డీసీఎం వాహనం బొలెరోను ఢీకొట్టగా రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో బాణావత్ సాయి (18) అక్కడికక్కడే మృతి చెందగా, నితిన్ బాబు(18) తీవ్రంగా గాయపడగా అతని పరిస్థితి విష మించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. డ్రైవర్ సిపాయికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి వెల్లడించారు. కాగా మృతుడు బాణావత్ సాయి, నితిన్‌బాబు వరుసకు సోదరులు. ఇరువురు నల్గొండలోని గౌతమి కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఘటనా స్థలంలో రహదారికి ఇరువైపులా రెండు వాహనాలు బోల్తా పడగా రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. హైవేకు సంబంధించిన వాహనం సకాలంలో రాకపోవడంతో పోలీసులు స్పందించి డీసీఎంలో ఉన్న సరకును తొలగించి పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సాగర్ ఎడమ కాల్వలో అంగన్‌వాడీ టీచర్ గల్లంతు

వేములపల్లి న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి సాగర్ ఎడమకాల్వలో పడగా అంగన్‌వాడీ టీచర్ గల్లంతు కాగా భర్త ప్రాణాపాయ స్థితిలో బయటపడిన సంఘటన మండలంలోని రావులపెంట గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామేపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఇటీవల పదోన్నతిపై వెళ్లి పోగా ఆమనగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని రావువారిగూడెంకు చెందిన అంగన్‌వాడీ టీచర్ పేరబోయిన అనూష(35)కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. శనివారం ఉదయం తన భర్త సైదులుతో కలిసి ద్విచక్ర వాహనంపై అనూష కామేపల్లి గ్రామానికి విధులపై వెళ్లింది. సాయంత్రం తన భర్తతో పాటు తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రావులపెంట గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో భర్త సైదులు ఈదుకుంటూ ప్రాణాపాయ స్థితిలో ఒడ్డుకు చేరగా అనూష, ద్విచక్ర వాహనం గల్లంతు కాగా, సమాచారం అందుకున్న వేములపల్లి ఎస్సై డి. వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కాల్వలో గల్లంతైన అనూష కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనూషకు కుమార్తె రాజాకుమారి, కుమారుడు స్వరణ్‌రాజ్ ఉన్నారు.